

తెలుగు దిన పత్రిక https://aksharagalam.com

# అక్షరగళం

నిజం..నిర్భయంగా

## గ్రేటర్ -హైదరాబాద్

బుధవారం 07, జనవరి 2026





పోటీలకు ఎంపికైన జట్లు

## ఆల్ ఇండియా బాల్ బ్యాడ్మింటన్‌కు
# జేఎన్టీయూ జట్లు ఎంపిక

- కూకట్పల్లి రమ్య గ్రౌండ్‌లో సెలక్షన్ ట్రయల్స్
- చెన్నై వేదికగా జరిగే జాతీయ స్థాయి పోటీల్లో జేఎన్టీయూ జట్లు
- స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ
- అనుభవజ్ఞుల సమక్షంలో ప్రతిభావంతుల ఎంపిక
- విజయ లక్ష్యంతో జాతీయ పోటీలకు సిద్ధం

**అక్షరగళం, కూకట్‌పల్లి:** జేఎన్టీయూ యూనివర్సిటీ హైదరాబాద్ బాల్ బ్యాడ్మింటన్ పురుషులు మరియు మహిళల జట్లను ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల కోసం ఎంపిక చేశారు. ఈ ఎంపిక ప్రక్రియను మంగళవారం కూకట్పల్లి రమ్య గ్రౌండ్‌లో నిర్వహించగా, ప్రతిభావంతులైన క్రీడాకారుల నుంచి జట్లను తుది రూపు దిద్దారు. ఈ సెలక్షన్ ట్రయల్స్‌ను జేఎన్టీయూ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ ప్రొఫెసర్ ఎన్.ఎస్. దిలీప్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నల్లగొండ అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. క్రీడాకారుల నైపుణ్యం, ఆటతీరు, శారీరక దృఢత్వాన్ని పరిశీలించి జట్లను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఎంపికైన పురుషుల జట్టు ఫిబ్రవరి 14వ తేదీ నుంచి 17వ తేదీ వరకు చెన్నైలోని భారతి దాసన్ యూనివర్సిటీలో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ బాల్



బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొననుంది. అదే విధంగా మహిళల జట్టు ఫిబ్రవరి 11వ తేదీ నుంచి 15వ తేదీ వరకు చెన్నైలోని అన్నా యూనివర్సిటీలో జరిగే ఆల్ ఇండియా బాల్ బ్యాడ్మింటన్ ఉమెన్ ఛాంపియన్ షిప్‌లో పోటీ పడనుంది.

ఈ సందర్భంగా స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ ప్రొఫెసర్ ఎన్.ఎస్. దిలీప్ మాట్లాడుతూ, జాతీయ స్థాయి పోటీల్లో జేఎన్టీయూ జట్లు మెరుగైన ప్రదర్శన కనబరిచి విశ్వవిద్యాలయానికి గౌరవం తీసుకువస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సెలక్షన్ ప్రక్రియలో ఇండియన్ బాల్ బ్యాడ్మింటన్ జట్టు కెప్టెన్ రమణతో పాటు వివిధ కళాశాలలకు చెందిన ఫిజికల్ డైరెక్టర్లు, సీనియర్ క్రీడాకారులు పాల్గొని తమ సూచనలు అందించారు. వారి అనుభవం యువ క్రీడాకారులకు మార్గనిర్దేశంగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు.




సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి

## మున్సిపల్ పరిధిలో ఓటర్ల జాబితా
# సవరణపై శ్రద్ధ వహించాలి

- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి

**అక్షర గళం, మేడ్చల్ ప్రతినిధి:** త్వరలోనే మున్సిపల్ ఎన్నికలు నిర్వహించ నున్నందున మున్సిపల్ పరిధిలో ఓటర్ల జాబితా సవరణపై శ్రద్ధ వహించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని 12 మున్సిపాలిటీలలో

మిగతా.. 2లో





డిజిపి శివధర్ రెడ్డి వద్ద నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న మహిళా కానిస్టేబుల్ స్వరూప



దుండిగల్ స్టేషన్ విధుల్లో మహిళా హెడ్ కానిస్టేబుల్ స్వరూప

- తొలిసారిగా దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో రూపకల్పన
- రెండు కేసులను తెలుగులో రూపొందించిన మహిళా కానిస్టేబుల్ స్వరూప
- స్థానిక భాషలో చార్జ్ షీట్‌లను రూపొందించడంపై ప్రశంసలు.
- అభినందించిన రాష్ట్ర డిజిపి శివధర్‌రెడ్డి
- సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్

## తెలుగులోనే అభియోగపత్రం
# పోలీస్ చరిత్రలో కొత్త అధ్యాయం

**అక్షరగళం, దుండిగల్:** గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల పరిసరాల్లో ఇప్పటికీ ఆంగ్ల భాషపై పట్టు లేని వారి సంఖ్య ఎక్కువగా ఉన్న నేపథ్యంలో, ఇంగ్లీషులో ఉన్న పోలీస్ పత్రాలు, చార్జ్‌షీట్లు సామాన్యులకు అర్థం కాకపోవడం ఒక ప్రధాన సమస్యగా ఉంది. దీనిని అధిగమించేందుకు తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఒక సరికొత్త అధ్యాయానికి నాంది పలికారు. దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న మహిళా హెడ్ కానిస్టేబుల్ స్వరూప తెలుగు భాషలో చార్జ్ షీట్ లను రూపొందించడంపై రాష్ట్ర పోలీసు డిజిపి శివధర్ రెడ్డి రెడ్డి ప్రశంసించారు. ఉన్నతాధికారుల సహకారంతో స్థానిక భాష అయిన తెలుగులో

మిగతా.. 2లో

అక్షరగళం

# మున్సిపల్ పరిధిలో ఓటర్ల జాబితా సవరణపై శ్రద్ధ వహించాలి

మొదటి పేజీ తరువాయి..

తొమ్మిది జిహెచ్ఎంసిలో విలీనంకాగా మిగిలిన 3 (మూడుచింతల పల్లి, ఎల్లంపేట్, ఆలియాబాద్) మున్సిపాలిటిలలో ఎన్నికల నిర్వహణ నిర్ణయం మేరకు ఓటరు లిస్టు పై మంగళవారం




సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి

కలెక్టరేట్ విసి హాల్ లో అన్ని పొలిటికల్ పార్టీ సభ్యులతో జిల్లా కలెక్టర్ మను చౌదరి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ మను చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ప్రక్రియలో పార్టీ సభ్యులు తమ వంతు సహాకారం అందించాలన్నారు. అందులో భాగంగా ఓటర్ జాబితా మ్యాపింగ్ ప్రక్రియలో బోగస్ ఓట్లు, డెత్ కేసులను, డబుల్ ఓట్లను తొలగించాలని అన్నారు. ఈసారి జరిగే ఎన్నికలలో బ్యాలెట్ బాక్సుల ద్వారా నిర్వహించడం జరుగుతుందన్నారు. వార్డుల రీ ఆర్గనైజెషన్‌లో బూతులు మారిన వారిని సవరిం చాలని సూచించారు. వార్డులకు సంబంధించిన కాలనీలలో ప్రజలకు అనుకూలంగా ఉండేలా దగ్గరగా బూతులను ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ బూతులను ఎక్కువగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. అవసరమైన మార్పులు చేర్పులకు సంబంధిత ఫారంలలో నమోదు చేసుకోవాలన్నారు.

బూత్ లెవెల్ ఎజెన్సీల వారి ద్వారా బోగస్ ఓట్లను తొలగించాలన్నారు. నిజమైన మార్పులు ఏమైన ఉంటే వెంటనే నమోదు చేసుకోవాలన్నారు. ఓటర్ల నమోదు నిరంతరాయ ప్రక్రియని కొత్తగా నమోదు చేసుకునే వారు ఫారం 6 లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం అన్ని పార్టీల సభ్యులు తెలిపిన సమస్యల పై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో జిల్లా డిఆర్ఓ హరిప్రియ, డిఆర్డిఓ సాంబశివరావు, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ మతిన్, పలు పొలిటికల్ పార్టీల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కొలను హన్మంత్ రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న పాస్టర్లు

## కొలన్ హన్మంత్ రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు

**అక్షరగళం , కుత్బుల్లాపూర్:**

2026 నూతన సంవత్సరం సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పాస్టర్లు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కొలను హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు నూతనోత్సాహంతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలకాలని, ఆశలు ఆశయాలూ తీర్చే బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలు, అందరికి నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

# తెలుగులోనే అభియోగపత్రం పోలీస్ చరిత్రలో కొత్త అధ్యాయం

మొదటి పేజీ తరువాయి..

అభియోగ పత్రాలను అందించి నూతన విధానానికి శ్రీకారం చుట్టారు.

**తొలిసారిగా తెలుగులో..**

ప్రభుత్వ కార్యాలయాలు, న్యాయ ప్రక్రియలు అన్నీ ఆంగ్ల భాషకే పరిమితమవుతున్న కాలంలో, ప్రజల మాతృభాషలోనే న్యాయ సంబంధిత వివరాలను రిపోర్టులను అందించాలన్న దృక్పథంతో దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న మహిళా హెడ్ కానిస్టేబుల్ స్వరూప పోలీస్ శాఖలో కొత్త ఒరవడికి తెర లేపారు. 2025 సంవత్సరంలో తనకు కేటాయించిన రెండు కేసుల్లో పూర్తిగా తెలుగులోనే దర్యాప్తు పూర్తి చేసి అభియోగపత్రాలు దాఖలు చేయడం ద్వారా బాధితులు, నిందితులు కేసు వివరాల చార్జిషీట్లను సులువుగా అర్థం చేసుకునే ప్రక్రియను మరింత దగ్గర చేశారు. ఎటువంటి తప్పులకు తావు లేకుండా పూర్తిగా తెలుగులో చార్జి షీట్లను రూపొందించి ఉన్నత అధికారులకు విజయవంతంగా నివేదించారు.



**రెండు కేసులలో?**

మొదటి కేసులో బౌరంపేట్‌కు చెందిన వెంకటేష్ అనే వ్యక్తి తన కిరాణా దుకాణంలో అక్రమంగా మద్యం నిల్వలు ఉంచి విక్రయాలు జరుపుతున్నట్టు తేలడంతో, దుండిగల్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మద్యం సీసాల ఆధారంగా ఎక్సైజ్ చట్టం కింద కేసు నమోదు చేసి, మేడ్చల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ కోర్టుకు పూర్తిగా తెలుగులోనే అభియోగపత్రం సమర్పించడం తెలంగాణ రాష్ట్ర పోలీస్ వ్యవస్థలో అరుదైన ఘట్టంగా నిలిచింది. మరో ఘటనలో అర్ధరాత్రి సమయంలో అదృశ్యమైన 35 ఏళ్ల వలస కూలీ మహిళ, ఆమె నాలుగేళ్ల కుమార్తె కేసులో స్వరూప వేగంగా స్పందించారు.

భర్త ఇచ్చిన ఫిర్యాదుపై కేసును తక్షణమే ఛేదించి తల్లి?పాపను సురక్షితంగా గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగిం చారు. అనంతరం ఈ ఘటనపై తన దర్యాప్తు తుది నివేదికను కూడా తెలుగులోనే ఏసీపీ మేడ్చల్ శంకర్ రెడ్డికి సమర్పించారు.

**ప్రశంసించిన డిజిపి**

ప్రజలకు సులభంగా అర్థమయ్యే విధంగా తెలంగాణ రాష్ట్ర అధికార భాషల్లో ఒకటైన తెలుగులోనే అభియుగ పత్రాలను రూపొందించిన విధానాన్ని మహిళా హెడ్ కానిస్టేబుల్ స్వరూప ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్నారు. ఇటీవల బంజారా హిల్స్‌లోని తెలంగాణ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో, రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి, ఐపీఎస్., సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, ఐపీఎస్., సమక్షంలో 50 మంది పోలీస్ సిబ్బందికి ప్రశంసలు అందుకున్న సైబర్ యోధుల్లో ఒకరిగా నిలవడం ఆమె కృషికి నిదర్శనం.

మాతృభాషలో న్యాయ ప్రక్రియను ప్రజలకు చేరువ చేసిన ఈ ప్రయత్నం, భవిష్యత్తులో పోలీస్ శాఖలో ఒక మార్గదర్శకంగా మారనుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఒక పోలీస్ శాఖలోనే కాకుండా అన్ని ప్రభుత్వ శాఖలలో స్థానిక భాష అయినా తెలుగులో నే ఉత్తర ప్రత్యుత్తరాలు, నివేదికలు రూపొందించే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని ఈ సందర్భంగా కోరుతున్నారు.